క్లుప్తంగా

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

క్రోసూరు: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ నిర్మూలన కోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ వారి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) క్రోసూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.రమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 20వ తేదీ వరకూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తులు అందజేయవచ్చని వివరించారు. పెదకూరపాడు నియోజకవర్గ పరిసర ప్రాంతాలకు చెందిన 10వ తరగతి ఆపైన చదివిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు బాపతు అంజిరెడ్డి 77798 58789 నంబరును సంప్రదించాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

పగుళ్లు తీస్తున్న సిమెంటు రోడ్లు



నకరికల్లు: విద్యుత్ స్తంభాలను ట్రాక్టర్‌లకు కట్టి సిమెంట్ రోడ్లపై లాగడంతో రోడ్లు పగుళ్లు తీస్తున్నాయని సమాచార హక్కు ప్రచార ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి ముజావర్ జాన్‌అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేసే విద్యుత్ స్తంభాలను ట్రాక్టర్‌లకు కట్టి రోడ్డుపై తీసుకు వెళుతున్నారని ఆయన వాపోయారు. విద్యుత్‌శాఖ అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో కాంట్రాక్టర్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని.. దీంతో గ్రామంలోని సీసీరోడ్లు దెబ్బతింటున్నాయని వివరించారు. స్తంభాలు వేసే చోటు వరకు ట్రాక్టర్‌లలో పెట్టి తీసుకురాకుండా ట్రాక్టర్‌కు కట్టి రోడ్లపై ఈడ్చుకు రావడంతో రోడ్లన్నీ పాడవుతున్నాయన్నారు. కాంట్రాక్టర్‌ల నిర్లక్ష్యంతో రోడ్లకు నష్టం వాటిల్లుతుందని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అక్షరాస్యతే అభివృద్ధికి మూలం



నకరికల్లు: అక్షరాస్యతే అభివృద్ధికి మూలమని ఎంపీడీవో సురేష్ అన్నారు. 59వ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని నకరికల్లులో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరక్షరాస్యులు అక్షరాలు నేర్చుకోవడం ద్వారా జీవితంలో అభివృద్ధిని సాధించవచ్చని సూచించారు. సంపూర్ణ అక్షరాస్యత సాధించే దిశగా అన్నిశాఖల సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కేవీ శివప్రసాద్, ఏపీవో ప్రసాద్, ఏపీఎం సమాధానం, వీవోఏలు, సీసీలు, ఎఫ్‌ఏలు, టీఏలు, వయోజన విద్య సూపర్‌వైజర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమరావతి: అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని సోమవారం స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు శ్రీ లక్ష్మణ రాజు మాట్లాడుతూ.. విద్యాదానం మహాదానం అని, చదువును ఎవరూ దొంగిలించలేరని, ప్రతి ఒక్కరూ అక్షరాస్యులై దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. విద్యను నేర్చిన వారు తమ కాళ్లపై తాము స్వతంత్రంగా నిలబడగలరని అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ సందర్భంగా ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.వి రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ విజిట్‌లో విద్యార్థులు

ముప్పాళ్ళ: పారిశ్రామిక రంగంపై అవగాహనతో పాటుగా ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంచుకునేందుకు ఇండస్ట్రియల్ విజిట్ దోహదపడుతుందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.నాగేంద్రమ్మ తెలిపారు. ముప్పాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా సమగ్ర శిక్షా సహకారంతో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలను సోమవారం సందర్శించారు. కళాశాలలోని ఎలక్ట్రానిక్ ల్యాబ్, ప్రాజెక్ట్‌లను ప్రత్యక్షంగా పరిశీలించి పలు విషయాలను తెలుసుకున్నట్లు ఒకేషనల్ ట్రైనర్ ఎస్.విజయ్‌బాబు తెలిపారు.

దమ్ము చక్రాలతో రోడ్లు ఛిద్రం!



నకరికల్లు: దమ్ముచక్రాల ట్రాక్టర్‌లతో ప్రధాన రోడ్లతో పాటు గ్రామాల్లోని సీసీరోడ్లు ఛిద్రమైపోతున్నాయి. పొలాలకు దమ్ము చేసే ట్రాక్టర్‌ల యజమానులు నిబంధనలు పాటించకుండా రాకపోకలు సాగించడంతో రోడ్లన్నీ కోతకు గురవుతున్నాయి. ప్రజాధనం వెచ్చించి నిర్మించిన రోడ్లు కోతకు గురై నష్టం జరుగుతున్నా అధికారుల పర్యవేక్షణ కరువవుతోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లు ఛిద్రమవకుండా కాపాడాలని ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

అన్నదాతకు బాసటగా వైఎస్సార్ సీపీ

- నేడు అన్నదాత పోరు కార్యక్రమాలు
- పోస్టర్లను ఆవిష్కరించిన నాయకులు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పెదకూరపాడు నియోజకవర్గ పార్టీ నాయకులు

నకరికల్లు: కూటమి ప్రభుత్వంలో పంటలకు గిట్టుబాటు ధర లేక రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి మండిపడ్డారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు పోస్టర్‌ను స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం సత్తెనపల్లిలో నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమంలో పాల్గొని రైతులకు బాసటగా నిలవాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో చేపట్టిన వ్యవసాయ సంక్షేమ పథకాలన్నీ యథాతథంగా అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వంగా రాజారెడ్డి, వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్ కుమార్‌రెడ్డి, దూదేకుల బాషా, ఎంపీటీసీ సభ్యుడు రేమిడిచర్ల కాశీ, జక్కిరెడ్డి కోటిరెడ్డి, అనుబంధ విభాగాల నాయకులు కంఠమనేని చందు, పాలూరి రాజశేఖర్, కోనంకి ఆదినారాయణ, రుసుం శ్రీనివాసరావు, డీకొండ ఆదినారాయణ, శాగం చంద్రశేఖర్‌రెడ్డి, మద్దం సురేష్, దావూద్, సుబ్బారెడ్డి, పమ్మి కృష్ణారెడ్డి, చొడారెడ్డి పాల్గొన్నారు.

జననేత పిలుపు మేరకు..

అమరావతి: జననేత జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు మంగళవారం ఉదయం 10 గంటలకు సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద జరగనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు నంబూరు శంకరరావుతో పాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు. సత్తెనపల్లి ఆర్డీవోకు వినతిపత్రం ఇవ్వనున్నామని.. మండల పరిధిలోని రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

ఉదయం 10 గంటలకు నిరసన కార్యక్రమం..

క్రోసూరు: కూటమి ప్రభుత్వం అన్నదాతలను రోజురోజుకు ఇబ్బందులకు గురిచేస్తోందని పెదకూరపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపించారు. రైతన్నలకు యూరియా సరఫరా వేగవంతంగా అందించడానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మంగళవారం ఉదయం 10 గంటలకు సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట అన్నదాత పోరు నిరసన కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా క్రోసూరులోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం అన్నదాత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు కొండవీటి కోటేశ్వరావు, పద్మా వెంకటేశ్వర రెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, క్రోసూరు మండల పార్టీ అధ్యక్షుడు వెలది అప్పారావు, అచ్చంపేట మండల అధ్యక్షుడు చిల్కా చంద్రయ్య, బెల్లంకొండ మండల అధ్యక్షుడు అన్నపురెడ్డి నర్సిరెడ్డి, మాజీ యార్డు డైరెక్టర్ పాశం శ్రీనివాసరెడ్డి, క్రోసూరు జెడ్పీటీసీ షేక్ జమీలాగఫార్, అనుముల రోశిరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, అచ్చంపేట పార్టీ నాయకులు నెల్లూరి చంద్రబాబు, సుంకర శ్రీనివాసరెడ్డి, సాయిరెడ్డి, మాజీ సొసైటీ డైరెక్టర్ బద్రయ్య, షేక్ ఖాదర్, షేక్ ముస్తఫా, తదితర నాయకులు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ: కూటమి ప్రభుత్వం రైతుల సాగుకు అవసరమైన యూరియా అందించడంలో విఫలమైందని.. ప్రభుత్వ తీరును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు కోరారు. ముప్పాళ్ళలోని పార్టీ కార్యాలయంలో అన్నదాత పోరు పోస్టర్‌ను సోమవారం వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. సత్తెనపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఆర్డీవో ఆఫీస్ వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. ర్యాలీలో రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఎంజేఎం రామలింగారెడ్డి, మాజీ మండల కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, మధిర వెంకటేశ్వరరెడ్డి, న్యాయవాది మారూరి లింగారెడ్డి, రామకృష్ణారెడ్డి, బత్తుల కనకం, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బెల్లంకొండ: అన్నదాతకు బాసటగా నిలుస్తూ వైఎస్సార్ సీపీ మంగళవారం తలపెట్టిన 'అన్నదాత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చెన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో మండల పార్టీ నాయకులతో కలిసి అన్నదాత పోరు కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోవడంలేదని, ఎరువులను కూడా అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అన్నపరెడ్డి నర్సిరెడ్డి, నాయకులు చింతారెడ్డి సాయిరెడ్డి, పీఎస్కే మౌలాలి, గడిపర్తి చిన్నబాబు, రామాంజనేయులు నాయక్, జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నకరికల్లు పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



ముప్పాళ్ళలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



బెల్లంకొండలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

వంటశాల షెడ్డు నిర్మాణానికి విరాళం



అచ్చంపేట: మండలంలోని కోగంటివారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు కావాల్సిన వంటగది నిర్మాణానికి 'స్నేహ హస్తాలు' ఫౌండేషన్ సోమవారం రూ.20 వేలు చెక్కును ఎంఈవో ఏకుల ప్రసాదరావు చేతుల మీదుగా హెచ్ఎం రమాదేవికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. పాఠశాలలో వంటశాల షెడ్డు నిర్మాణానికి రూ.40 వేలు ఖర్చు అవుతుందని అన్నారు. కాగా అందులో సగం సొమ్మును స్నేహ హస్తాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోనం నాగిరెడ్డి, స్నేహహస్తాలు కో–ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు, ఉపాధ్యాయులు జాయ్, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ ఊటుకూరి మేరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

ముప్పాళ్ళ: మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో గల విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11కేవీ మాదల ఫీడర్ లైన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ జి.సుచరిత సోమవారం తెలిపారు. మాదల ఫీడర్ పరిధిలోని రామకృష్ణాపురం, మాదల, ఇరుకుపాలెం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

యూరియో రామచంద్రా!

- ఖరీఫ్ సీజన్‌లో అరకొరగా పంపిణీ
- ఇబ్బందులు పడుతున్న రైతన్నలు
- నేడు వైఎస్సార్ సీపీ 'అన్నదాత' పోరు



యూరియా కోసం ముప్పాళ్ళ సొసైటీ వద్ద పడిగాపులు కాస్తున్న అన్నదాతలు (ఫైల్)

సత్తెనపల్లి: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో యూరియా కొరత రైతులను తీవ్రంగా కలవరపెడుతోంది. అవసరం మేర యూరియా దొరకకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ, అనుబంధ శాఖల రైతులకు అవసరమైన విత్తనాలు ఎరువులు, పురుగు మందులు, మార్కెటింగ్ సేవలు అన్ని పారదర్శకంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల ఇంటి వద్దకే అందించింది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సేవలకు మంగళం పాడింది.

ఆచరణలో శూన్యం..

సత్తెనపల్లి నియోజకవర్గంలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో యూరియా కొరత తీవ్రంగా ఉంది. ఒక్కో మండలంలో ఒకటి, రెండు రైతు సేవా కేంద్రాల(ఆర్ఎస్‌కే)వద్ద అరకొరగా ఉండగా మిగిలిన రైతు సేవా కేంద్రాల్లో యూరియా నిల్వలు లేవు. అలానే ఒకటి, రెండు పీఏసీఎస్‌లలో మాత్రమే యూరియా ఉంది. డీలర్ల వద్ద యూరియా పూర్తిగా లేదు. సత్తెనపల్లి మండలంలో 40 మంది డీలర్లు ఉండగా.. కేవలం ఇద్దరు డీలర్ల వద్ద 10 రోజుల క్రితం యూరియా ఉండగా ఇప్పుడు ఒక టన్ను కూడా లేదు. 19 రైతు సేవా కేంద్రాలు ఉండగా కేవలం రెండింటిలో మాత్రమే 4 మెట్రిక్ టన్నుల యూరియా ఉంది. 5 సొసైటీలలో కేవలం ఒక్క సొసైటీలో మాత్రమే 20 మెట్రిక్ టన్నులు యూరియా ఉంది. సత్తెనపల్లి మండల వ్యాప్తంగా కేవలం 24 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

ముప్పాళ్ళ మండలంలో..

ముప్పాళ్ళ మండలంలో 17 మంది డీలర్లు, 8 రైతు సేవా కేంద్రాలు, 3 సొసైటీలు ఉండగా కేవలం 3 సొసైటీలో మాత్రమే 11 మెట్రిక్ టన్నుల యూరియా ఉంది. రాజుపాలెం మండలంలో 12 మంది ఎరువుల డీలర్లు ఉండగా ఒక్క డీలర్ వద్ద కూడా యూరియా నిల్వలు లేవు. 12 రైతు సేవా కేంద్రాలు ఉండగా 20 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉంది. 3 సొసైటీలకు గానూ ఒక్క సొసైటీలో మాత్రమే 20 మెట్రిక్ టన్నుల యూరియా ఉన్నట్లు అధికారుల లెక్కల బట్టి తెలుస్తోంది. నకరికల్లు మండలంలో 31 మంది ఎరువుల డీలర్లు, 12 రైతు సేవా కేంద్రాలు, 3 సొసైటీలు ఉండగా కేవలం 16 మెట్రిక్ టన్నుల యూరియా ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

నేడు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన..

ఎరువుల బ్లాక్ మార్కెట్, యూరియా కొరతపై రైతులకు బాసటగా వైఎస్సార్ సీపీ మంగళవారం 'అన్నదాత పోరు' పేరుతో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టనుంది. యూరియా సహా రైతులకు అవసరమైన ఎరువులు వెంటనే సరఫరా చేయాలని.. బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని.. ఎరువులను పక్కదోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన, వినతిపత్రం సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆ మేరకు వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు.

అమర కళాకారుల సంస్మరణ సభలు నిర్వహించాలి



మాట్లాడుతున్న లక్ష్మీ చెన్నకేశవరావు

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అమర కళాకారుల సంస్మరణ సభలు, ప్రజానాట్య మండలి సాంస్కృతిక సంస్థలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సత్తెనపల్లి నియోజకవర్గ కార్యదర్శి వల్లెం లక్ష్మీ చెన్నకేశవరావు అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. లక్ష్మీ చెన్నకేశవరావు మాట్లాడుతూ.. ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు డాక్టర్ గరికపాటి రాజారావు, ప్రముఖ రచయితలు సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు, రక్త కన్నీరు నాగభూషణం, లక్ష్మీ పెరుమాళ్లు, కోడూరు అచ్చయ్య, సంగీత దర్శకులు సి.మోహన దాస్, తాతినేని చలపతిరావు, వి.మధుసూదనరావు, కోగంటి గోపాలకృష్ణ, ఆచార్య ఆత్రేయ, వీరమాచినేని సరోజిని, తాపీ రాజమ్మ, విశాలాంధ్ర సౌమిత్రి, తమ్మారెడ్డి కృష్ణమూర్తి, తాపీ ధర్మారావు, ప్రముఖ సినీ రచయిత బొల్లి ముంత శివ రామకృష్ణ తదితరులు ప్రజానాట్యమండలి అభ్యున్నతికి జీవితాంతం కృషి చేశారని అన్నారు. వారి సంస్మరణలు నిర్వహించడం ప్రజానాట్యమండలి కర్తవ్యంగా భావించాలన్నారు. సమావేశంలో ఆటో యూనియన్ ప్రెసిడెంట్ డీఆర్ మస్తాన్, ఆర్.కోటేశ్వరరావు, ఏ.రమేష్, జి.రాజు, ఒంటిపులి కిరణ్, తదితరులు ఉన్నారు.

మున్సిపాలిటీలో విలీన ప్రక్రియను ఉపసంహరించుకోవాలి



శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న భీమవరం గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు

సత్తెనపల్లి: మున్సిపాలిటీలో సత్తెనపల్లి మండలం భీమవరం గ్రామ పంచాయతీని విలీనం చేసే ప్రక్రియను ఉపసహరించుకోవాలని వార్డు మెంబర్లు ఆందోళన వ్యక్తం చేశారు. భీమవరంకు చెందిన కొల్లు మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో భీమవరం గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు సోమవారం సత్తెనపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామ పంచాయతీలో మొత్తం 12 వార్డులు ఉండగా ఇరువురు వార్డు సభ్యులు మృతి చెందారన్నారు. మిగిలిన 10 మందిలో 8 మంది వార్డు సభ్యులు విలీన ప్రక్రియను వ్యతిరేకించి మున్సిపాలిటీలో కలుపుటకు అభ్యంతరం తెలిపామన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు బలుసుపాటి నరసింహారావు, ఒంటిపులి కోటేశ్వరమ్మ, కుంచాల అంకమ్మరావు, మల్లెల భూలక్ష్మి, బండారు శ్రీను, పాలె పోగు రాంబాబు, అనపర్తి బుజ్జి, ఎర్రగుంట్ల సువార్త, తదితరులు ఉన్నారు.

పెన్షనర్లకు రామారావు లేని లోటు తీరనిది



మాట్లాడుతున్న లక్ష్మీ నారాయణ

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు స్వర్గీయ బొడ్డు రామారావు లేని లోటు తీరనిదని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. రామారావు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, సెక్రటరీగా పదవులను నిర్వహించి కంప్యూటర్ జ్ఞానంతో అనేక మంది పెన్షనర్స్‌కు సహాయ పడ్డారని ఆయన సేవలను కొనియాడారు. అనంతరం రామారావు చిత్రపటానికి సతీమణి నాగేంద్రమ్మ, అల్లుళ్లు లక్ష్మీనారాయణ, జనార్దన్ రావు, వెంకట్రామయ్య, కుమార్తెలు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు హాజరై నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేబీఆర్‌జీ ప్రసాద్, పెన్షనర్స్ అసోసియేషన్ బాధ్యులు సుబ్బారెడ్డి, పోతులూరయ్య, గద్దె మురహరిరావు, పొత్తూరి రామకోటయ్య, మల్లేశ్వరరావు, సూర్యనారాయణ, చంద్రయ్య, సుబ్బారావు, మొహిద్దీన్, హనుమంతరావు హాజరై ఆయన సేవలను కొనియాడారు. అంతయ్య, క్రీస్తుదాసు, రంగారెడ్డి, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, మల్లేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు.

యూరియా వాడకంపై రైతులకు అవగాహన



ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని ఇరుకుపాలెం గ్రామ సచివాలయం వద్ద యూరియా వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.నగేష్, మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డిలు పాల్గొని సాగుకు అవసరమైన యూరియా నిల్వలున్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో శేషుబాబు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సచివాలయం అందుబాటులో ఏర్పాటు చేయాలని వినతి

సత్తెనపల్లి: పట్టణంలోని 21, 22 వార్డుల ప్రజలకు సంబంధిత సచివాలయాన్ని ఆ వార్డుల పరిధిలోనే ఏర్పాటు చేయాలని సీపీఎం సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి ధరణికోట విమల డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.ఆనందకుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. విమల మాట్లాడుతూ.. 21, 22 వార్డులకు సంబంధించిన సచివాలయం నరసరావుపేట రోడ్డులోని వెంకటపతి కాలనీలో ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ వార్డుల మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు తమ సమస్యలను విన్నవించుకునేందుకు ఆ సచివాలయానికి 2 కిలో మీటర్ల దూరం నడిచి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు జడ రాజకుమార్, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

సత్తెనపల్లి: వివిధ రుగ్మతలతో బాధపడుతున్న వారికి పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో గల తన కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ సోమవారం పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 22 మంది బాధితులకు మంజూరైన రూ.11,77,800 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యెల్లినేడి రామస్వామి, దరువూరి నాగేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, జనసేన నాయకుడు తవిటి భావనారాయణ, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు అవసరం




రాజుపాలెం: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని.. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవింద్రారత్నాకర్ తెలిపారు. మండలంలోని కొండమోడులోని కాలనీలో గల పరిసరాల పరిశుభ్రతను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మురికి కాలువల్లో ఎబిట్ ద్రావణాన్ని పిచికారీ చేయించి బ్లీచింగ్ చల్లించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి రవితేజనాయక్ రాజుపాలెం జయంతీ కాలనీలో పర్యటించి వైద్య సిబ్బందితో జ్వరాలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది చంద్రశేఖర్, వసంతరావు, షరీఫ్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధుడి వైద్యానికి ఆర్థిక సాయం



సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన కల్యాణ మండపంలో నైట్‌వాచ్మెన్‌గా గత 18 ఏళ్ల నుంచి అంకిత భావంతో విధులు నిర్వహిస్తున్న వృద్ధుడు జూలూరి రాధాకృష్ణమూర్తి హఠాత్తుగా గుండెజబ్బుకు గురయ్యాడు. దీంతో వైద్య సేవల కోసం ఆర్థిక సహాయం అందించేందుకు ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం ముందుకు వచ్చింది. సంఘ అధ్యక్షుడు బచ్చు వెంకటేశ్వర్లు (కొండలు) ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు దివ్వెల శ్రీనివాసరావు దాతల దాతృత్వంతో రూ.60 వేల నగదు సేకరించి రాధాకృష్ణ మూర్తికి సోమవారం అందించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా



యూరియా వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాజుపాలెం: మండలంలో యూరియా పుష్కలంగా ఉందని.. రైతులు అధైర్య పడొద్దని మండల ప్రత్యేక అధికారి ఎస్.నారదాముని తెలిపారు. మండలంలోని రెడ్డిగూడెంలో మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్ ఎస్.సరోజ, ఏవో పి.వెంకట నర్సయ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో పి.ముక్కంటి, సచివాలయ సిబ్బందిలు కలిసి యూరియా వినియోగంపై ఇంటింటా అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు అవసరం మేరకు మాత్రమే యూరియా కొనుగోలు చేయాలని.. అధిక మొత్తంలో తీసుకుని నిల్వలు చేయరాదని తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో ఆర్ఎస్‌కేల ద్వారా, సొసైటీల ద్వారా, ప్రైవేటు షాపుల ద్వారా 720 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని తెలిపారు. ప్రస్తుతం 62 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉన్నట్లు వివరించారు. మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.